చూస్తూ.. సూచనలు చేస్తూ..


పాఠశాలలో మంచినీటిని పరిశీలిస్తూ..


అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో ముచ్చటిస్తున్న కలెక్టర్ మాధవీలత

- కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు
- అధికారులు ఉరుకులు.. పరుగులు
- పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలపై ప్రత్యేక శ్రద్ధ

సీటీఆర్ఐ: అన్నం తిన్నావా... అ, ఆలు దిద్దావా.. ఏబీసీడీలు రాశావా.. అని చిన్న పిల్లలున్న ఇంట్లో తల్లి తన బిడ్డలను గారం చేయడం చూస్తుంటాం. కానీ జిల్లాకు కలెక్టర్ అయి ఉండి కూడా మాధవీలత అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులను అంతే ఆప్యాయంగా పలకరిస్తున్నారు. వారితో నేలపై కూర్చుని వారికి అన్నం తినిపిస్తూ అమ్మలా లాలిస్తున్నారు. ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా తిని పరిశీలిస్తున్నారు. ఒక్కోసారి విద్యార్థులకు పాఠాలు చెప్పే టీచర్‌గా మారిపోతున్నారు. కలెక్టర్‌గా నిత్యం సమీక్షలతో బిజీగా ఉండడమే కాకుండా ఆకస్మిక తనిఖీలతో అధికారులకు ముచ్చెమటలు పట్టిస్తున్నారు. ముఖ్యంగా అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడ లోటుపాట్లు స్వయంగా తెలుసుకుంటున్నారు. అప్పటి వరకూ కలెక్టరేట్‌లో సమీక్షలు నిర్వహించి అంతే సడన్‌గా వేరో చోటకు తనిఖీకి వెళ్లడం ఆమెకే చెల్లింది. తాను పరుగులు పెడుతూ, అధికారులను కూడా పరుగులు పెట్టిస్తున్నారు. ఏ రోజు ఎక్కడికి వస్తారో తెలియక పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో సిబ్బంది అలెర్ట్‌గా ఉంటున్నారు. దీంతో విద్యార్థులు, చిన్నారులకు మెనూ ప్రకారం ఆహారాన్ని అందిస్తున్నారు. మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచుతున్నారు. మంచినీరు ఎప్పటికప్పుడు పట్టి పిల్లలకు ఇస్తున్నారు.

టీచర్‌గా మారి..

లాలాచెరువు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలలో పదో తరగతి విద్యార్థులతో కలెక్టర్ మాధవీలత ముఖాముఖి సంభాషించారు. ఫిజిక్స్ పాఠ్యాంశంలోని ప్రశ్నలను సంధించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు కలెక్టర్ అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పడంతో వారిని అభినందించారు. అంతే కాకుండా ప్రభుత్వం తెలుగు, ఇంగ్లిష్ మీడియాన్ని ప్రోత్సహిస్తున్న సంగతి అందరూ గుర్తుపెట్టుకోవాలని సూచించారు. ఇంగ్లిష్ నాలెడ్జ్ ఉండటం వల్ల మరిన్ని ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చని వివరిస్తున్నారు.

అన్నీ పరిశీలించి..

ఇటీవల అర్బన్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను కలెక్టర్ మాధవీలత ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆనంద్‌నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లడమే కాకుండా అక్కడ చిన్నారులతో కలసి నేలపై కూర్చుని వారితో ముచ్చటించారు. వారికి వడ్డించే ఆహారాన్ని తానూ తిన్నారు. అక్కడి చిన్నారితో పలకపై అ, ఆలు దిద్దించి తల్లిలా లాలించారు. స్థానిక లాలాచెరువు వద్ద ప్రభుత్వ పాఠశాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం రుచి చూడడమే కాకుండా అక్కడ మంచినీరు ఎలా ఉందని పరిశీలించారు. విద్యార్థినుల టాయిలెట్‌ను పరిశీలించారు. పలు సూచనలు చేశారు.

పటిష్ట డ్రైనేజీ వ్యవస్థకు చర్యలు

- ఎంపీ మార్గాని భరత్‌రామ్
- 32వ డివిజన్‌లో గుడ్ మార్నింగ్ రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం సిటీ: ఇళ్ల నుంచి వచ్చే మురుగునీరు పోయేందుకు డ్రైనేజీలు లేక దోమలు విపరీతంగా పెరిగిపోయాయని, తక్షణమే పటిష్ట డ్రైనేజీ వ్యవస్థ నిర్మించాలని అధికారులకు ఎంపీ భరత్ రామ్ ఆదేశాలు జారీ చేశారు. శనివారం వైఎస్సార్ సీపీ 32వ డివిజన్ ఇన్‌చార్జి ముప్పన ఆధ్వర్యంలో స్థానిక జాంపేట గాంధీ విగ్రహం వద్ద నుంచి గుడ్ మార్నింగ్ రాజమహేంద్రవరం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం, వీధి దీపాలు వెలగకపోవడం, చాలా వీధుల్లో రహదారికి ఇరువైపులా కాలువలు లేకపోవడం వంటి ఫిర్యాదులను స్థానికులు తెలిపారు. డ్రైనేజీలు నిర్మించకపోవడంతో దోమలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే నిర్మాణాలు చేపట్టాలని నగర పాలక సంస్థ ఎస్ఈ పాండురంగారావుకి ఆదేశాలు జారీ చేశారు. కొన్ని ఇళ్ల లెట్రిన్ వ్యర్థాలు నేరుగా కాలువలోకి వదులుతున్నారని, అలా చేయరాదని అన్నారు. రెండు రోజుల్లో ఈ సమస్య పరిష్కరించాలని అధికారులకు సూచించారు. తన భర్త మరణించాడని, మందులకు నెలకు రూ.10 వేలు ఖర్చవుతుందని ఓ మహిళ ఆవేదన వ్యక్తం చేయగా.. వెంటనే పెన్షన్ అందేలా చర్యలు తీసుకోవాలని వలంటీర్, వార్డు ఇన్‌చార్జి, సంబంధిత అధికారులకు భరత్‌రామ్ తెలిపారు. కార్యక్రమంలో నగర పార్టీ అధ్యక్షుడు అడపా శ్రీహరి, మజ్జి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


గుడ్ మార్నింగ్ రాజమహేంద్రవరంలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీ భరత్‌రామ్

పరిహారం అందజేత

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): నల్సా స్కీమ్‌లో ఇద్దరు మహిళలకు రూ.6 లక్షల పరిహారం అందజేసినట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రత్యూషకుమారి శనివారం తెలిపారు. నల్సా విక్టిమ్ కాంపన్సేషన్ స్కీం 2018 ద్వారా ఒక బాధితురాలికి రూ.లక్ష, నల్సా విక్టిమ్ కాంపన్సేషన్ స్కీం 2015 ద్వారా మరో బాధితురాలికి రూ.5 లక్షల పరిహారం అందజేశారు.

క్యాలెండర్ల పంపిణీ

మధురపూడి: జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముద్రించిన జక్కంపూడి జైత్రయాత్ర నూతన సంవత్సర క్యాలెండర్లను శనివారం కోరుకొండలో పంపిణీ చేశారు. ఇక్కడి సచివాలయంలో పంచాయతీ సెక్రటరీ కె.రమేష్‌బాబు ఆధ్వర్యంలో వీటిని వలంటీర్లు, సిబ్బందికి అందజేశారు. ఇవి గ్రామంలోని అన్ని కుటుంబాలకు పంపిణీ చేయాలని ఆదేశించారు. ఉప సర్పంచ్ నేతుల చిన్ని, ఎంపీటీసీ గొల్లపల్లి ప్రవీణ్, వైఎస్సార్ సీపీ నాయకులు బొరుసు బద్రీ పాల్గొన్నారు.

నిందితుల కోసం గాలింపు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరంలో బస్ డ్రైవర్‌గా పనిచేస్తున్న కొయ్య రాజశేఖర్‌పై దాడి చేసిన నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. మూడో పట్టణ పోలీసుల కథనం ప్రకారం.. ఈ నెల 16న రాజశేఖర్ పని ముగించుకుని ఇంటికి వెళ్తుండగా పేపర్‌మిల్ డంపింగ్ యార్డు వద్ద కొందరు యువకులు అతనిని ఆపి దౌర్జన్యం చేశారు. ప్రతిఘటించిన అతనిపై బ్లేడ్‌తో విచక్ష రహితంగా కోశారు.

ఐదుగురిపై కేసు నమోదు

కడియం: స్థానిక వెంకటసూర్య సినిమా థియేటర్‌లో గలాటా సృష్టించిన ఐదుగురు యువకులపై కేసు నమోదు చేసినట్లు కడియం పోలీసులు తెలిపారు. థియేటర్ వాచ్‌మెన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పి.శశికిరణ్‌వర్మ, డి.మధు, బి.రామకృష్ణ, పి.కోదండరాయుడు, టి.రాజేష్‌లపై కేసు నమోదు చేశామన్నారు. సెకండ్ షో సినిమా జరుగుతుండగా గలాటా సృష్టించడంతో పాటు, అక్కడి వస్తువులను ధ్వంసం చేశారని వాచ్‌మెన్ చేసిన ఫిర్యాదులో పేర్కొన్నారని తెలిపారు. అక్కడకు వెళ్లిన పోలీసు సిబ్బందిపై కూడా దురుసుగా ప్రవర్తించారని పోలీసు ఇన్‌స్పెక్టర్ పీవీజీ తిలక్ చెప్పారు. ఈ నేపథ్యంలో తమకు అందిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసినట్లు వివరించారు. ఇదిలా ఉండగా పోలీసులే అకారణంగా తమపై దౌర్జన్యం చేసి, కొట్టారని సంబంధిత యువకుల పేరిట సోషల్ మీడియాలో మెసేజ్‌లు హల్‌చల్ చేస్తున్నాయి.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కడియం: మాధవరాయుడుపాలెం పంచాయతీ పరిధిలోని చైతన్యనగర్‌కు చెందిన ఎస్.అప్పలనాయుడు (45) చికిత్స పొందుతూ మృతి చెందాడు. కడియం పోలీసుల కథనం ప్రకారం.. పేపరుమిల్లులో అప్పలనాయుడు కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నాడు. శనివారం ఎప్పటిలాగా అతని భార్య కూలి పనికి వెళ్లింది. కుమారుడు స్కూల్‌కు వెళ్లిపోయాడు. కుమారుడు స్కూల్ నుంచి ఇంటికి వచ్చి తలుపు తీసి చూసేసరికి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వేలాడుతూ అప్పలనాయుడు కనిపించాడు. దీంతో కేకలు వేయగా చుట్టుపక్కల వారొచ్చి అతనిని ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు.

ఆర్డినెన్స్ తీసుకురావాలి

ప్రకాశంనగర్: ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని ప్రభుత్వం శాశ్వతంగా కొనసాగించాలని, దీనికి ఆర్డినెన్స్ తీసుకురావాలని కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు జువ్వల రాంబాబు అన్నారు. శనివారం స్థానిక అంబేడ్కర్ భవనంలో జిల్లా కేవీపీఎస్ ఆధ్వర్యంలో వివిధ దళిత గిరిజన ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సానబోయిన రామారావు, సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, ఇసుకపట్ల రాంబాబు, కోరుకొండ చిరంజీవి, బాబూ రాజేంద్రప్రసాద్, పాల్గొన్నారు.

పాదయాత్ర విజయవంతం కావాలని పూజలు

సీటీఆర్ఐ: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఈ నెల 27వ తేదీ నుంచి యువ గళం పేరిట చేపట్టనున్న పాదయాత్ర విజయవంతం కావాలని ఆ పార్టీ మహిళా నాయకురాళ్లు ప్రత్యేక పూజలు చేశారు. శనివారం స్థానిక దేవీచౌక్‌లోని బాలాత్రిపుర సుందరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాలే విజయలక్ష్మి, మజ్జి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డైరెక్టర్ల పదవీకాలం పొడిగింపు


డి.వీరభద్రయ్య


కె.మల్లీశ్వరి

కడియం: రాష్ట్ర దేవాంగ సంక్షేమ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ల పదవీ కాలాన్ని మరో రెండేళ్లు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కడియం మండలం వీరవరం గ్రామానికి చెందిన దొంతంశెట్టి వీరభద్రయ్య, దుళ్ల గ్రామానికి చెందిన కొండపల్లి మల్లీశ్వరిలు 2020లో డైరెక్టర్లుగా నియమితులయ్యారు. వీరి పదవీకాలం ఇప్పుడు రెండేళ్లు పొడిగించారు. తమను డైరెక్టర్లుగా కొనసాగించేందుకు కృషి చేసిన ఎంపీ మార్గాని భరత్‌రామ్, రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్‌లకు వారు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే డైరెక్టర్లను పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు, ఆర్యాపురం బ్యాంకు చైర్మన్ రామకృష్ణతులసి, కడియం మండల పార్టీ అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్, తదితర పార్టీ నాయకులు అభినందించారు.

స్వచ్ఛ సమాజాన్ని నిర్మిద్దాం..


ర్యాలీ నిర్వహిస్తున్న బ్యాంక్ ఉద్యోగులు

రాజమహేంద్రవరం సిటీ: పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ కృషి చేయడం ద్వారా స్వచ్ఛమైన సమాజాన్ని నిర్మిద్దామని బ్యాంక్ ఆఫ్ బరోడా రీజినల్ మేనేజర్ విజయరాజు అన్నారు. శనివారం నగరంలో బ్యాంకు ఆఫ్ బరోడా ఆధ్వర్యంలో స్వచ్ఛత పక్షోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో తమ బ్యాంకు ఈ నెల 16 నుంచి 31 వరకూ స్వచ్ఛత పక్షోత్సవం నిర్వహిస్తోందన్నారు. బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు సేవ్ ఇండియా, గ్రీన్ ఇండియా అంటూ నినాదాలు చేస్తూ ఏకేసీ కాలేజీ నుంచి జేఎన్ రోడ్డు వరకూ ర్యాలీ నిర్వహించారు. బ్యాంక్ ఆఫ్ బరోడా డిప్యూటీ రీజినల్ మేనేజర్ ఉండి శ్రీనివాసరావు, రీజినల్ కార్యాలయ సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

కడియంలో శాంతి ర్యాలీ


తహసీల్దార్ సుజాతకు వినతిపత్రం ఇస్తున్న కడియం గ్రామస్తులు

కడియం: స్థానిక దేవీచౌక్ ఎదురుగా ఎటువంటి విగ్రహాలకు అనుమతులు ఇవ్వవద్దని కోరుతూ గ్రామస్తులు రాజకీయ పార్టీలకు అతీతంగా శనివారం శాంతి ర్యాలీ చేశారు. షాపులు మూసివేసి వ్యాపారులు, గ్రామస్తులు పాల్గొన్నారు. అనంతరం ప్రధాన వీధుల నుంచి ర్యాలీ సాగించారు. ×మేము ఎవరికీ వ్యతిరేకం కాదు..₹ అంటూ నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్ ఎం.సుజాతకు వినతి పత్రం అందజేశారు. దేవీచౌక్‌లో కొన్నేళ్లుగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతున్నాయని, ఇక్కడ ఎటువంటి విగ్రహాలకు అనుమతులు ఇవ్వొద్దని విఘ్నేశ్వర తాపీపనివారల సంఘం కూడా వినతిపత్రం అందజేసింది. అలాగే కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసేందుకు గ్రామస్తులు వెళ్లారు.

రాజేష్ కుటుంబానికి పరామర్శ


రాజేష్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న వాసంశెట్టి సుభాష్ తదితరులు

ధవళేశ్వరం: బ్లేడ్ బ్యాచ్ సభ్యుడి దాడిలో ధవళేశ్వరం కంచర్లలైన్ ప్రాంతానికి చెందిన అండిబోయిన రాజేష్ మృతిచెందగా ఆ కుటుంబాన్ని శనివారం శెట్టిబలిజ నాయకులు పరామర్శించారు. రాజేష్ కుటుంబాన్ని అమలాపురం శెట్టిబలిజ సంఘ యువ నాయకుడు వాసంశెట్టి సుభాష్ పరామర్శించి రూ.50 వేల ఆర్థిక సాయం ప్రకటించారు. అంగటి రమేష్ రూ.5 వేలు సాయాన్ని అందజేశారు. నాయకులు బత్తిన ఏడుకొండలు, బసనబోయిన సత్తిబాబు, గండిబోయిన నాగరాజు, బత్తిన ప్రసాద్, ఇళ్ల రాంబాబు, సారిపల్లి వెంకటేశ్వరరావు, పుట్టా పరేష్‌నాథ్, కేతా సాయి తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

కడియం: గ్రామసభలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని సర్పంచ్ కొండపల్లి పట్టియ్య తెలిపారు. శనివారం దుళ్ల సచివాలయం వద్ద ఆయన అధ్యక్షతన గ్రామసభ జరిగింది. సెక్రటరీ సరోజరాణి మాట్లాడుతూ పలు అంశాలను వివరించారు. గ్రామంలోని పలు సమస్యలను సభ్యులు సమావేశం దృష్టికి తెచ్చారు. ఉప సర్పంచ్ తోకల శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యులు కట్టుంగా నాగరాజు, పుచ్చల బసవశంకరం, నాయకులు తాతపూడి బాబి, సన్నపు బ్రహ్మానందం, కంటిపూడి సాయి తదితరులు పాల్గొన్నారు.

మా పిల్లలకు ప్రాణభిక్ష పెట్టన్నా..

ఎంపీతో తలసేమియా బాధిత చిన్నారుల తల్లి

రాజమహేంద్రవరం సిటీ: అన్నా మా పిల్లలకు ప్రాణభిక్ష పెట్టన్నా అంటూ తలసేమియా వ్యాధితో బాధపడుతున్న ఇద్దరు ఆడపిల్లల తల్లి అభ్యర్థనకు ఎంపీ మార్గాని భరత్‌రామ్ చలించిపోయారు. శనివారం స్థానిక 46వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి మేడబోయిన సునీల్ ఆధ్వర్యంలో రామదాసుపేటలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా అక్కా చెల్లెళ్లు యాసరపు లక్ష్మీపార్వతి, యాసరపు వాణి తలసేమియా వ్యాధితో బాధపడుతున్న విషయాన్ని స్థానికులు ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు.

తక్షణమే స్పందించిన ఆయన బాలికల తల్లిదండ్రులతో మాట్లాడారు. తలసేమియా పిల్లలకు ఒకరికే ప్రభుత్వ పింఛను అందుతోందని, మరొకరికి అందించాలని కోరారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒకరికే వస్తుందని, అయితే సీఎం కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ విభాగం అధికారి దృష్టికి తీసుకువెళ్లగా వైద్యపరంగా సహకరిద్దామని హామీ ఇచ్చారని పిల్లల తల్లిదండ్రులకు ఎంపీ తెలిపారు. ఎనిమిదో తరగతి విద్యార్థినికి ట్యాబ్ ఇవ్వాలని డీఈఓకు ఎంపీ అన్నారు. యాసిడ్ దాడి కారణంగా బాధపడుతున్న మహిళకు మరోసారి వైద్య పరీక్షలు చేసి సర్టిఫికెట్ ఇవ్వాలని వైద్యాధికారులకు సూచించారు. పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.


తలసేమియా వ్యాధితో బాధపడుతున్న అక్కాచెల్లెళ్లతో మాట్లాడుతున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్

సురక్షిత ప్రయాణం సాగించండి

రోడ్డు భద్రతా వారోత్సవాల్లో ఎమ్మెల్యే రాజా

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రహదారి నిబంధనలు పాటించి ప్రతి ఒక్కరూ సురక్షిత ప్రయాణం సాగించాలని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా నగరంలో రవాణా శాఖ ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించపోవడం, అతి వేగంగా నిర్లక్ష్యంగా ప్రయాణించడంతో విలువైన ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే హెల్మెట్ ధరించకపోవడంతో ప్రమాదాల్లో అనేక మంది మృత్యువాత పడ్డారన్నారు. దీనివల్ల ఆయా కుటుంబాల్లో విషాదం నిండిందన్నారు. సురక్షిత ప్రయాణం కోసం ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చే ఉద్దేశంతో ఇటువంటి కార్యక్రమాలను చేపడుతున్నామని రాజా అన్నారు. జిల్లా రవాణా అధికారి కేవీ కృష్ణారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు 34వ జాతీయ భద్రతా వారోత్సవాల్లో భాగంగా బైక్ ర్యాలీ నిర్వహించామన్నారు. హెల్మెట్ పెట్టుకోవడం వల్ల ప్రయోజనాలు, రహదారిపై రవాణా భద్రతా నియమాలు పాటించడంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టామని అన్నారు.


రహదారి భద్రతా వారోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

తద్వారా ప్రమాదాలు, మరణాల సంఖ్య తగ్గించడమే లక్ష్యమన్నారు. కలెక్టర్ కె.మాధవీలత ఆదేశాల మేరకు జిల్లాలో ప్రమాదాలను నివారించేందుకు ఈ ప్రక్రియను అందరి సమన్వయంతో కృషి చేస్తున్నామని అన్నారు. ఆర్టీవో కార్యాలయం వద్ద ప్రారంభమైన ర్యాలీ సెంట్రల్ జైల్, నందం గనిరాజు సెంటర్, తాడితోట, ఆర్టీసీ బస్టాండ్, మోరంపూడి జంక్షన్, సర్వీస్ రోడ్ మీదుగా లాలాచెరువు జంక్షన్ నుంచి ఆర్టీవో కార్యాలయానికి తిరిగి చేరుకుంది. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు రంగనాయకులు, సంపత్, రామ్‌నారాయణ్, సహాయ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు శ్రీదేవి, రాధిక, సుమా, సబితా తదితరులు పాల్గొన్నారు.

ప్రతాప్‌రెడ్డిని సత్కరించిన చందన

రాజమహేంద్రవరం రూరల్: జేసీఎస్ రాష్ట్ర కోఆర్డినేటర్ పుత్తా ప్రతాప్‌రెడ్డిని శనివారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్, జేసీఎస్ మండల ఇన్‌చార్జులతో కలసి పూలమొక్క అందజేసి శాలువాతో సత్కరించారు. అలాగే పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను సన్మానించారు. కడియం, రూరల్ మండలాల జేసీఎస్ ఇన్‌చార్జులు తాడాల విష్ణుచక్రవర్తి, తాటికొండ విష్ణుమూర్తి, నగరపాలక సంస్థ పరిధిలోని రూరల్ డివిజన్ల జేసీఎస్ ఇన్‌చార్జి రాజమౌళి పాల్గొన్నారు.


ప్రతాప్‌రెడ్డిని సత్కరిస్తున్న చందన నాగేశ్వర్, జేసీఎస్ ఇన్‌చార్జులు

విద్యార్థులు అన్నింటా రాణించాలి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా పౌరసరఫరాల అధికారి పి.ప్రసాదరావు అన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం ఏర్పాటు చేసిన వ్యాసరచన పోటీలలో జిల్లా స్థాయి విజేతలకు బహుమతీ ప్రదానం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా పౌరసరఫరాల కార్యాలయంలో శనివారం జరిగింది. తెలుగు మీడియం వ్యాసరచన పోటీలో నిడదవోలు మండలం పురుషోత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని జె.జెన్ని, వక్తృత్వ పోటీలో అదే స్కూల్ విద్యార్థి మహాలక్ష్మి ప్రథమ బహుమతులు సాధించారు. ఇంగ్లిష్ మీడియం వక్తృత్వ పోటీలో రాజమహేంద్రవరం నన్నయ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థిని హర్షితి, వ్యాసరచనలో లాలాచెరువు మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థి వి.మున్నాకీర్తి ప్రథమ బహుమతులు పొందగా వారికి నగదు, సర్టిఫికెట్‌లను ప్రసాదరావు అందజేశారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్‌కుమార్, డీసీపీసీ సభ్యుడు గొట్టిముక్కల అనంతరావు తదితరులు పాల్గొన్నారు.


విజేతలతో ప్రసాదరావు తదితరులు

సమన్వయంతో జనార్దనస్వామి కల్యాణోత్సవాలు


కల్యాణోత్సవ ఏర్పాట్లపై చర్చిస్తున్న వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్

ధవళేశ్వరం: ధవళగిరిపై వేంచేసి ఉన్న లక్ష్మీజనార్దన స్వామివారి కల్యాణోత్సవాలను సమన్వయంతో విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ సూచించారు. భీష్మ ఏకాదశి పర్వదినం సందర్భంగా ధవళేశ్వరంలో జరిగే స్వామివారి కల్యాణోత్సవ ఏర్పాట్లపై దేవస్థానం, పంచాయతీ అధికారులతో శనివారం ఆయన సమీక్షించారు. ఫిబ్రవరి 1న కల్యాణోత్సవం, రథోత్సవం జరగనుంది. దీనికి సంబంధించిన ఏర్పాట్లపై అధికారులకు చందన నాగేశ్వర్ పలు సూచనలు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి పెద్దిరాజు, పంచాయతీ కార్యదర్శి సూరిబాబు, స్థానిక నాయకులు, పార్టీ శ్రేణులతో చర్చించారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఏవిధమైన అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. ఏ సహాయం కావాలన్నా అందుబాటులో ఉండి పరిష్కరిస్తానని ఆయన తెలిపారు. స్థానిక రామపాద క్షేత్రం వద్ద గోదావరిలో స్నానం చేసే భక్తుల సౌకర్యార్థం బారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణపై సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

బియ్యం పంపిణీ

ప్రకాశంనగర్: స్థానిక స్వర్ణాంధ్ర సేవా సంస్థ ప్రాంగణంలో శనివారం ఎల్ఐసీలో తాత్కాలిక ఉద్యోగులుగా పని చేస్తున్న 52 మందికి సుమారు రూ.60 వేల విలువైన బియ్యం బస్తాలను ఉద్యోగుల సంఘం నాయకులు ఎంఏఎఫ్ బెనర్జీ, పి.సతీష్ అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వర్ణాంధ్ర సేవలు అభినందనీయమన్నారు. ఎల్ఐసీ మహిళా ఉద్యోగుల సంఘం కన్వీనర్ శిరీష, ఎలిపే శ్రీనివాస్, గుబ్బల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మంతెన భావరాజుకు పలువురి నివాళి


భావరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక అశోకా థియేటర్ అధినేత మంతెన రాజబాబు తండ్రి దివంగత మంతెన భావరాజు మృతికి శనివారం పలువురు నివాళులర్పించారు. స్థానిక వెంకటేశ్వరనగర్‌లోని రాజబాబు స్వగృహంలో భావరాజు పెద్దకార్యం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీ, వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్ మార్గాని భరత్‌రామ్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, సినీ నిర్మాత సుమంత్, నగర ప్రముఖులు, సినీ డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు పాల్గొని తదితరులు నివాళులర్పించారు.

సారా బట్టీలపై దాడులు : ముగ్గురి అరెస్టు

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, డిస్ట్రిక్ట్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ ఆదేశాల మేరకు సౌత్ ఎస్ఈబీ స్టేషన్ ఇన్‌స్పెక్టర్, ఎస్ఈబీ పోలీసు ఇన్‌స్పెక్టర్, టెక్నికల్ వింగ్ ఎస్సై, సిబ్బంది ధవళేశ్వరంలో శనివారం సారా బట్టీలపై దాడులు నిర్వహించారు. సారా బట్టీ నిర్వహిస్తున్న ఐదుగురిని గుర్తించి ముగ్గురిని అదుపులోకి తీసుకోగా ఇద్దరు పరారయ్యారు. మోరంపూడికి చెందిన కొప్పిశెట్టి రామకృష్ణ, పిడింగొయ్యికి చెందిన అత్తిలి శంకర్, బెల్లం సరఫరా చేస్తున్న శ్రీరామపురానికి చెందిన మాదారపు సూరిబాబులను అరెస్టు చేశారు. గుమ్ములూరుకు చెందిన మట్టా గణేష్, రఘునాథపురానికి చెందిన బన్నీ పరారయ్యారు. ఈ దాడులలో 4,200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, 205 లీటర్ల సారా, 432 కిలోల నల్ల బెల్లం, 10 కిలోల ఈస్ట్, రెండు గ్యాస్ సిలెండర్లు, రెండు ద్విచక్ర వాహనాలు, సారా తయారీ పాత్రలు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.3,58,750 గుర్తించారు. గ్రామీణ ప్రాంతాల్లో సారా విక్రయిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆఫీసర్ పిట్టా సోమశేఖర్ అన్నారు. ఒక వ్యక్తిపై ఐదుకు మించి కేసులు ఉంటే పీడీ యాక్ట్ నమోదు చేస్తామన్నారు.


నిందితులు, స్వాధీనం చేసుకున్న వస్తువులతో జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆఫీసర్ సోమశేఖర్

ఉత్సాహంగా నో బ్యాగ్ డే

కంబాలచెరువు: పాఠశాల విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించడంలో భాగంగా శిక్షణ ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నెలలో మొదటి, మూడో శనివారాన్ని సృజన నో బ్యాగ్ డేగా నిర్వహిస్తుందని నారాయణపురం మున్సిపల్ కార్పొరేషన్ స్కూల్ హెచ్ఎం ఎస్.పార్వతి అన్నారు. ఆ స్కూల్‌లో విద్యార్థులచే చిత్రాలు వేయించడం, సంప్రదాయ గిరిజన నృత్యాన్ని పరిచయం చేయడం, ఓరిగామి వంటి కృత్యాలను చేయించారు. ఉపాధ్యాయులు శ్రీనివాస్, కాంతికుమారి, సునీల్, గంగాభవాని పాల్గొన్నారు. శ్రీనాగరాజా నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాలలో ఓరిగామి విధానంలో విద్యార్థులతో వివిధ పక్షుల ఆకృతులను పేపర్‌తో తయారు చేసి ప్రదర్శించారు. హెచ్ఎం మోటూరి మంగారాణి, ఉపాధ్యాయులు సత్యనారాయణ, వైబాగుల రోహిణి, అరుణ తదితరులు పాల్గొన్నారు.


తయారు చేసిన బొమ్మలను చూపుతున్న శ్రీనాగరాజా స్కూల్ విద్యార్థులు